ప్రజాశక్తి
ఆదివారం 5 నవంబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని ఖండ్రుమ్ జియుపి పాఠశాలలో చదువుతున్న గిరి విద్యార్థులకు అక్షర ఎడ్యుకేషన్, వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ చైర్మన్ దొగ్గా ప్రియ బాంధవి ఆధ్వర్యంలో శనివారం పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, క్రికెట్ బ్యాట్ , క్యారమ్ బోర్డులను అందజేవారు. గ్రామస్తులకు చీరలు,, రగ్గులు, పిల్లలకు బనియన్లను ఉచితంగా పంపిణీ చేశారు. వీటిని స్థానిక పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు కె.హరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలోని నిరుపేద గిరి విద్యార్థులకు అక్షర ఫౌండేషన్, వెల్ఫేర్ సొసైటీ చేస్తున్న సేవలు అమోఘమని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు కే.సంజీవరావు మాట్లాడుతూ, అక్షర ఫౌండేషన్ సామగ్రి ఇవ్వడం ఆనందదాయకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు మల్ల తులసి, అన్నపూర్ణ పి.దుర్గా భాయ్ పాల్గొన్నారు.

సామగ్రి చూపుతున్న విద్యార్థులు

అమానవీయ పాలనకు అంతం పలకాలి

◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ◆ విద్య, వైద్యం, తాగునీటికి నోచని ఆదివాసీలు
◆ కనీస సదుపాయాలు కరువు ◆ డోలీ మోతలతో మాతా, శిశు మరణాలు
◆ అల్లూరి జిల్లాలో కొనసాగిన ప్రజా రక్షణ భేరి యాత్ర ◆ ఎక్కడికక్కడ అపూర్వ స్పందన, వినతుల వెల్లువ

రాజవొమ్మంగిలో జరిగిన సభలో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు, వేదికపై వి.శ్రీనివాసరావు, సురేంద్ర, కిరణ్ తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, కొయ్యూరు, గొలుగొండ, సీలేరు, రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరం విలేకరులు

'ఆదివాసీలకు విద్య, వైద్యం, తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించలేని అమానవీయ ప్రభుత్వాలివి. రాజ్యాంగం కల్పించిన హక్కులను మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. అటవీ సంపదను ఆదానీ వంటి వారికి అప్పగించేందుకు.. ఆదివాసీలను తరలించడానికి చేస్తున్న కుట్రలను సంఘటితంగా ప్రతిఘటించాలి. హక్కులను కాపాడుకోవాలి' - అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లాలో సాగింది. ఆరో రోజు జికె.వీధి మండలంలోని రొంపుల, కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం, రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరంల్లో బస్సు యాత్ర అపూర్వ స్వాగతం మధ్య సాగింది. రక్షణ భేరి బృంద నాయకులకు పూలమాల వేసి, తిలకం దిద్ది హారతి పట్టి ప్రజలు తమ సమస్యలను వివరించారు. రాతపూర్వకంగా పలు సమస్యలపై వినతులు అందజేశారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ అడవిపై హక్కు కోసం పోరాడిన అల్లూరి ఆశయాలను తుంగలో తొక్కి ప్రయివేటు వ్యక్తులకు ఖనిజ సంపదను కట్టబెట్టాలని ప్రభుత్వాలు చూస్తున్నాయని అన్నారు. పోరాటాల ద్వారా హక్కులను కాపాడుకోవాలన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వని ప్రభుత్వాలు, బినామీలకు మాత్రం సాగులో లేకపోయినా హక్కు పత్రాలు ఇస్తున్నాయని తెలిపారు. గిరిజనులకు నష్టం చేసే గిరిజన ప్రజా ప్రతినిధులను నమ్మొద్దని, వారికి న్యాయం చేసేందుకు, హక్కుల కోసం పనిచేస్తున్న సిపిఎంను బలపరచాలని అన్నారు. పార్టీ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నియోజకవర్గ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. మారుమూల ప్రాంతాల్లో విద్యుత్, తాగునీరు, రహదారి సౌకర్యాలు లేవన్నారు. ఆస్పత్రుల్లో వైద్యులు లేక, మందులు సరిపడా లేక గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తెస్తూ, గిరిజనుల కోసం, ప్రజా సమస్యలపై పనిచేస్తున్న సిపిఎంను బలపర్చాలన్నారు. రాష్ట్ర నాయకులు ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ మోడీ పాలనలో కష్ట జీవుల ఆదాయాలు పెరగడం లేదన్నారు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ ఎర్రవరంలో హైడల్ పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త జిల్లా ఏర్పాటుచేసినా ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయలేదని అన్నారు. రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎల్.రాంబాబు మాట్లాడుతూ ఏజెన్సీలో రహదారులు లేక డోలీమోతలతో తల్లీబిడ్డల మరణాలు తగ్గడం లేదన్నారు. ఈ యాత్రలో అల్లూరి సీతారామరాజు జిల్లా పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు చిన్నయ్యపడాల్, కొయ్యూరు మండల నాయకులు సూరిబాబు, వై.అప్పల నాయుడు, రాజవొమ్మంగి మండలం కొండపల్లి, సికిలింత సిపిఎం సర్పంచ్‌లు జగన్నాథం, కె.సూరిబాబు, మండల నాయకులు సూరిబాబు, అడ్డతీగల మండల నాయకులు పి.వెంకట్, బి.సురేష్, రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, మండల పార్టీ నాయకులు పంప దొర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న రంపుల గ్రామ ప్రజలు

పలు వినతులు

అరకు ఎంపీ మాధవి పంచాయతీలోని వెలగపాలెంలో గెడ్డ నీరు తాగుతున్నామని గిరిజనులు శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు. గిట్టుబాటు ధర కల్పించాలని జీడి మామిడి రైతులు, 2017 నుంచి టీఏ, డీఏలు ఇవ్వలేదని అంగన్‌వాడీలు, అంత్యోదయ కార్డులు ఇవ్వలేదని పివిటిజిలు, పోడు భూములపై పట్టాలు ఇవ్వాలని, రహదారులు, తాగు నీటి వసతి కల్పించాలని గిరిజనులు వినతిపత్రాలు అందజేశారు.

రంపచోడవరంలో జరిగిన ర్యాలీలో వి.శ్రీనివాసరావు, ప్రజలు

సివిల్ సర్వీసెస్, గ్రూప్స్‌కు ఉచిత శిక్షణ

- ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని డిగ్రీ పాసై ఉన్న గిరిజన యువతీ యువకులకు తొమ్మిది నెలలపాటు సివిల్ సర్వీసెస్, గ్రూప్-1, గ్రూపు-2 ఉద్యోగాలకు సంబంధించి ఐటీడీఏ ద్వారా ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో పిఒ మాట్లాడుతూ భోజనం, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసి అనుభవజ్ఞులతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13 నుండి 18వ తేదీ లోగా ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు మొదటి టెస్టు ఈ నెల 26 నిర్వహించి ఫలితాలు 28న ప్రకటించనున్నట్లు చెప్పారు. రెండో లెవెల్ టెస్టు డిసెంబర్ 3న నిర్వహించి 5న ఫలితాలు ప్రకటించిన జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో రెండు టెస్టులలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, డిసెంబర్ 10న ఫైనల్ లిస్టు ప్రకటించనున్నట్లు చెప్పారు. డిసెంబర్ 15 నుండి 2024 సెప్టెంబర్ 15వ తేదీ వరకు తొమ్మిది నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల గిరిజన యువతీ యువకులు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, డిగ్రీ పాసైన సర్టిఫికెట్లు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జత చేసి దరఖాస్తు సమర్పించాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-చింతూరు

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు మీద చింతూరు యువత ప్రదీప్ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎపి రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు చిచ్చడి మురళి మాట్లాడుతూ ప్రతి ఆటలో గెలుపు ఓటములు సహజమని, గెలుపు అనేది రేపటి విజయలకు పునాదిగా, ఓటమి అనేది రేపటి గెలుపు కోసం ప్రయత్నించే మరో అవకాశమని, ఆ దిశగా ఆడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సవలం అమల, స్థానిక సర్పంచ్ కారం కన్నారావు, చింతూరు సీఐ అప్పలనాయుడు, సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు పోడియం లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు ఆహమ్మద్ అలీ, తెలుగుదేశం యూత్ నాయకులు. రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఐటిడిఎ పిఒ చైతన్యకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

ఏజెన్సీ జర్నలిస్టులకు మైదాన ప్రాంతంలో ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి-చింతూరు

రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు కేటాయింపుపై రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిన నేపథ్యంలో ఏజెన్సీ జర్నలిస్టులకు మైదాన ప్రాంతాల్లో ఇళ్ళ స్థలాలు కేటాయించాలని కోరుతూ చింతూరు ఆర్డీవో, ఐటీడీఏ పీవో కావూరి చైతన్యకు ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం చింతూరు డివిజన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏజెన్సీలో ఎన్నో ఏళ్ళగా జర్నలిస్టులుగా పని చేస్తున్నా ప్రభుత్వం తరుపున నేటికీ ఏమి అందలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చేందకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఏజేన్సీ జర్నలిస్టులను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాలు అమలులో ఉన్నందునా ఈ ప్రాంత జర్నలిస్టులకు మైదాన ప్రాంతాల్లో ఇళ్ళ స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు విజయ్ కుమార్, షౌకత్ అలీ, మస్తాన్ జానీ, ఈశ్వరచారి, రియాజ్, జీవన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం మండలంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలని రంపచోడవరం తహశీల్దార్ పివివి జయ కుమార్ అన్నారు. రంపచోడవరం మండలం పెద్ద గద్దాడ, వేములకొండ గ్రామాల్లో శనివారం పోలింగ్ బూతులను బిఎల్ఓలు, వీఆర్వోలతో కలిసి తహశీల్దారు పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశాల మేరకు ఈనెల 4, 5 తేదీల్లో రెండు రోజులపాటు ఓటర్ నమోదుకు దరఖాస్తులు చేసుకునే విధంగా స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి ఇంటికీ బిఎల్వోలు, వీఆర్వోలు వెళ్లి ఓటర్ కార్డు దరఖాస్తులు చేసుకునే వారికి అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు.

పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహశీల్దారు

మాట్లాడుతున జిసిసి మేనేజర్

కాఫీ కొనుగోలుకు సిద్ధం

ప్రజాశక్తి-అనంతగిరి: గిరిజనులు పండిస్తున్న ఆర్గానిక్ కాఫీ కొనుగోలు చేపట్టేందుకు కాశీపట్నం జిసిసి బ్రాంచి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ మురళీకృష్ణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనంతగిరి, భీమపురం, భారజోల, మద్దగుడ, లక్ష్మీపురం, పినకోట, పైనంపాడు, వెంగడ ప్రాంతాల్లో కాఫీ కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, గిరిజనుల ఆర్థిక సామాజిక అభివృద్ధి కోసం ఏర్పడిన ప్రభుత్వ రంగ సంస్థ గిరిజన సహకార సంస్థకు కాఫీ విక్రయించాలని కోరారు. ఈ ఏడాది ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకే. పల్పర్ కాఫీ రూ.280, చెర్రీ కాఫీ రూ.145 రెబల్ స్టాకు రూ.70 ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. గిరిజన సంతల్లో గిరిజనులకు కావలసిన నిత్యావసర సరుకులు అమ్మకానికి సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సంతల్లో నాణ్యమైన సరుకులను గిరిజనులకు తక్కువ ధరకే అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ కామేశ్వరరావు, పూలింగ్ అసిస్టెంట్ దాసు, సిబ్బంది అప్పలస్వామి, అప్పన్న దొర, ముత్యాలు, శోభన్ బాబు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండలంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాల యూటీఎఫ్ మండల కార్యదర్శి సమ్మిరెడ్డి రాజు ఆధ్వర్యంలో స్థానిక విద్యాశాఖ అధికారికి శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.ధర్మారావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులపై పని భారం పెంచే అసంబద్ధత ఉత్తర్వులను సవరించాలని కోరారు. మూడు నెలలకు ఒకసారి ఉపాధ్యాయుల సంఘాలతో సమావేశాలు నిర్వహించాలని, యాప్ లో అప్లై చేసిన లీవ్స్‌ని అప్రూవల్ చేయాలన్నారు., మాన్యువల్‌గా అప్లై చేసిన దరఖాస్తును స్వీకరించడానికి తగు చర్యలు చేపట్టాలన్నారు.ఉపాధ్యాయుల ఎస్ఆర్‌లు ఎప్పటికప్పుడు అప్డేట్ చేసి, అన్ని రకాల ఇంక్రిమెంట్స్‌లు సకాలంలో ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు పుండారి, మండల ప్రధాన కార్యదర్శి గోపి, గౌరవ అధ్యక్షులు అప్పలనాయుడు, కోశాధికారి కూడా శ్రీనివాసమూర్తి, కార్యవర్గ సభ్యులు త్రినాథం, చిన్నబ్బాయి, మత్స్యరాజు, ధనుపతి పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ఆదేశం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల చదువుతోపాటు వారి ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. రంపచోడవరం మండలం నల్లగొండ ఆశ్రమ పాఠశాలను శనివారం ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సబ్జెక్టులన్నీ లెసన్ ప్లాన్ల ప్రకారం పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ఎవరికైనా జ్వరాలు ఉంటే వెంటనే దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లి తగు వైద్యం అందించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలని, రికార్డులు పక్కాగా నిర్వహించాలని కోరారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్య బోధన చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నదీ, రికార్డులు పరిశీలించారు. గుడ్లు, చికెన్, నిత్యావసర వస్తువుల సరఫరాపై ఆరా తీశారు. పిఒ వెంట గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, ఏటిడబ్ల్యుఒ రామ తులసి తదితరులున్నారు.

విద్యార్థుల చదువును పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ఏజెన్సీలోని ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలలో కొంతమంది ఉపాధ్యాయులు సరిగా సిలబస్ పూర్తి చేయకపోవడంపై రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలలో ప్రాజెక్ట్ అధికారి సందర్శించి పరిశీలించిన పిఒ, సిలబస్ పూర్తి చేయకపోయినా, విద్యా బోధనపై దృష్టి పెట్టకపోయినా సంబంధిత ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. భోజనాలకు సంబంధించిన స్టాకు మెయింటినెన్స్ చేయడంలోనూ, నాడు-నేడు పనులు నిర్వహించడంలో అలసత్వం వహించిన వారిపై కూడా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అడ్డతీగల

ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అడ్డతీగల మండల కార్యవర్గం ఎన్నిక మండల కేంద్రంలోని ఎంఆర్‌సిలో శనివారం సాయంత్రం జరిగింది. ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వై.విల్సన్‌బాబు, పర్యవేక్షునిగా జిల్లా కోశాధికారి కె.కృష్ణ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.మంగరాజు, అతిథిగా రంపచోడవరం బాధ్యులు వెంగళరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులు పి.రాంబాబు, అధ్యక్షులుగా కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బి.దొరబాబు, మహిళా ఉపాధ్యక్షులుగా జెవిబి.రమణమ్మ, ప్రధాన కార్యదర్శిగా కెవి.రాఘవులు, కోశాధికారిగా ఎస్.జగదీష్, ఎఫ్‌డబ్ల్యుఎస్‌గా కె.చిన్నారావు, పత్రికాధికారిగా ఎ.గాంధీరెడ్డి, మహిళా కార్యదర్శిగా పి.కమలారత్నం, ఆడిటర్‌గా ఎం.నరసింహారెడ్డి, కార్యదర్శులుగా ఎం.మల్లేశ్వరి, ఎం.అపర్ణ, పివి.సత్యప్రభ, ఎం.చిన్నారావు, సిహెచ్.సావిత్రి ప్రసాద్, జిఎన్ఆర్.పడాల్, జిల్లా కౌన్సిలర్స్‌గా జి.తేజోరావు, ఎస్.నాగప్రసాద్, ఎస్.చిన్నిబాబు, కె.కరుణశ్రీ, వి.బాలరాజు, ఇ.పాపారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రాఘవులు

కరువు మండలంగా ప్రకటించాలి : సిపిఎం

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు

మండలంలో పలు పంచాయతీ గ్రామాలలో రాజ్మా, చిక్కుళ్ళు, కంది , వరి, రాగుల పంటలు వర్షాలు కురవక పోవడంతో దెబ్బతిన్నాయని, ఈ నేపథ్యంలో కరువు మండలంగా ప్రకటించాలని సిపిఎం మండల కార్యదర్శి పాంగి భీమరాజు డిమాండ్ చేశారు. సిపిఎం కార్యాలయం వద్ద శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ,సకాలంలో వర్షాలు పడక పోవడంతో వేలాది ఎకరాల పంటలు పండ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే వ్యవసాయ సాగు భూములకు నీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్, సిపిఎం నాయకులు ఎంఎం శ్రీను, నారాయణ, రామదాసు లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

టిడిపితోనే రాష్ట్రం అభివృద్ధి

మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి- అనంతగిరి: టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కొండిబ, కాశీపట్నం పంచాయతీ పరిధి గ్రామాల్లో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమం పేరుతో ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పి జిల్లా వైఎస్ఆర్ పర్సన్ కె అప్పారావు, మండల అధ్యక్షులు టి.బుజ్జి బాబు, నాయకులు ఆనందు, దొన్ను, మాజీ ఎంపీటీసీలు సర్పంచులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

పర్యవేక్షణ చేస్తున్న తహసీల్దార్ సిహెచ్ కృష్ణారావు

ఓటర్ల నమోదు

ప్రజాశక్తి- పెదబయలు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓటర్ల నమోదు చేపడుతున్నామని తహసీల్దార్ సిహెచ్ కృష్ణారావు శనివారం విలేఖరులకు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అడుగుల పుట్టు, ఆల్మపుట్టు, పరిడ సచివాలయాలను తహసీల్దార్ సుడిగాలి పర్యటన చేసారు. ఆయన వెంట విఆర్‌ఒలు కె.సత్యారావు, సల్లంగి అజాద్, వెచ్చంగి జోగారావు పాల్గొన్నారు

పోస్టుల భర్తీ ఏదీ? : సిపిఎం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పాంగి భీమరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, నాలుగున్నర ఏళ్లుగా నిరుద్యోగ యువత డిఎస్సి ప్రకటనకు ఎదురు చూస్తుందన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ప్రచారంలో ప్రతి ఏడాది మెగా డీఎస్సీ, ఐటీడీఏ పరిధిలో ప్రత్యేక డీఎస్సీ తీస్తామని హామీ ఇచ్చి మరిచారన్నారు. సీపీఎం ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ముగింపు సందర్భంగా విజయవాడలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎంఎం శ్రీను, జి.నారాయణ, పి.రామదాసు పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన సుస్వరాభిషేకం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పద్మభూషణ్ డాక్టర్ చిరంజీవి కళాపరిషత్ ఆధ్వర్యాన శనివారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మెగా సంగీత విభావరి (సుస్వరాభిషేకం) వీక్షకులను ఉర్రూతలూగించింది. ఈ సందర్భంగా పలువురు కళాకారులు చిరంజీవి నటించిన పలు సినిమా పాటలు పాడి మైమరిపించారు. పసివాడి ప్రాణంతో పాటు పలు సినిమాలకు సంబంధించిన అలనాటి గీతాలు ఆలపించగా ప్రేక్షకులు కరతాల ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు.

ఏళ్లుగా ఎక్కడి సమస్యలక్కడే!

- ఏర్పాటు కాని పిహెచ్‌సి
- పునర్నిర్మాణానికి నోచని రోడ్డు, కాజ్‌వే
- వంతెన సౌకర్యం లేక వెతలు
- అవస్థలు పడుతున్న గుంటసీమ గిరిజనులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఏళ్లు గడుస్తున్నా మండలం తలోని మారుమూల గుంటసీమలో సమస్యలు పరిష్కారం కాలేదు. పిహెచ్‌సి ఏర్పాటు, రోడ్డు, కాజ్‌వే పునర్నిర్మాణానికి నోచుకోక పోవడంతో గిరిజనుల తీవ్ర అవస్థలు పడుతున్నారు.

గుంటసీమలో నూతన పిహెచ్‌సి ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. గుంటసీమలో పీహెచ్‌సి ఏర్పాటు చేయాలని కొన్నేళ్ల నుంచి ఆ ప్రాంతం గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. అయినా పీహెచ్‌సి ఏర్పాటు చేయడంలో పట్టించుకోలేదు.

మండల కేంద్రానికి గుంటసీమకు సుమారు 16 కిలోమీటర్లు దూరం ఉంటుంది. ఇక్కడ పిహెచ్‌సి లేక గుంటసీమ ప్రాంతంలోని గిరిజనులు అనారోగ్యాలకు గురైతే 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య సేవలు పొందాల్సి వస్తుంది. దూరం ఎక్కువగా ఉండటంతో కొంతమంది గిరిజనులు వైద్య సేవలు చేయించుకోవడానికి వెళ్లలేక గ్రామంలోనే ఉండిపోతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్న సందర్భాలు ఉన్నాయి. గుంటసీమ ప్రాంతంలో లైగండ, తూటంగి, గుంటసీమ, రంగిలి సింగి, గుంటగన్నేల 6 పంచాయతీలతో పాటు అరమ, కంద్రుం పంచాయతీల్లోని పలు గ్రామాలు కూడా గుంటసీమ ప్రాంతానికి అనుకొని ఉన్నాయి. ఎక్కువ పంచాయితీ గ్రామాలు కలిగి ఉండటంతో ఆ ప్రాంత గిరిజనులకు సకాలంలో వైద్య సేవలు అందించడానికి గతంలో నుంచి ఆ ప్రాంతం గిరిజనులు గుంటసీమలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తే ఆ ఆరు పంచాయతీలతో పాటు మిగిలిన కొన్ని పంచాయతీ గ్రామాల గిరిజనులకు వైద్యం సేవలు అందుబాటులో ఉంటాయని గిరిజనులు అంటున్నారు. మండలంలో 18 పంచాయతీలు ఉండగా డుంబ్రిగుడ, కిల్లోగూడ రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. గుంటసీమ ప్రాంతంలో 6 పంచాయతీలకు ప్రత్యేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

హుదూద్‌కు కొట్టుకుపోయిన కాజ్‌వే, రోడ్లు

గత 2014లో కురిసిన హుదూద్ తుఫాన్‌కు మండలంలోని శీలం గొంది రోడ్డు, చంప పట్టి కాజ్వే, పరిశీల రోడ్డు, కించుమండ కోడిగడ్డ వద్ద నిర్మించిన కాజ్వేలు కొట్టుకుపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు తొమ్మిదేళ్ల గడుస్తున్నా ప్రభుత్వం ఈ కాజ్వేల నిర్మాణం చేపట్టక పోవడంతో ఆయా ప్రాంత గిరిజనులు రవాణా సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో బయటికి రాలేక గ్రామంలోని ఉండి పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆ ప్రాంత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి సుమారు మూడు కిలోమీటర్లు దూరంలో పెదపాడు పీటీజి గ్రామం ఉండగా, కిలోమీటర్ దూరంలో కోసంగి, కోసంగి కాలనీ, పెదపాడు కాలనీతో పాటు పలు గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలకు కనెక్టివిటీ రోడ్డు నిర్మించాలన్న చాపరాయి జలపాతంలో వంతెన నిర్మించాల్సి ఉంటుంది. అక్కడ వంతెన మంజూరు చేయక పోవడంతో ఏళ్ల గడుస్తున్నా ఇప్పటివరకు ఆ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేనటువంటి పరిస్థితి ఏర్పడిందని ఆ ప్రాంత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంగిలిసింగి పంచాయతీ ముసర్లంక, గుంటగన్నెల పంచాయతీ కూనపుట్టు మధ్యలో వంతెన నిర్మిస్తే ఆ రెండు పంచాయతీలకు రవాణా సౌకర్యం దగ్గరవుతుందనీ గిరిజనులు అంటున్నారు. అక్కడ వంతెన నిర్మించాలని అధికారులకు, ప్రభుత్వానికి ఏళ్ల తరబడి గిరిజనులు విన్నవిస్తున్నా పట్టించుకోలేదని గిరిజనులు వాపోతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.

కొట్టుకు పోయిన కాజ్ వే

లంచం ఇవ్వడం.. తీసుకోవడం నేరం..

విజిలెన్స్ అదనపు సూపరింటెండెంట్ స్వరూప రాణి

ప్రజాశక్తి-పాడేరు: విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విజిలెన్స్ అదనపు సూపరింటెండెంట్ స్వరూపరాణి తెలిపారు. శనివారం స్థానిక బిస్మిల్లా కళ్యాణ మండపంలో విజిలెన్స్ అవగాహన వర్క్‌షాప్ ను నిర్వహించారు. సుమారు 250 మంది వివిధ శాఖల ఉద్యోగస్తులు, ప్రజలు హాజరైన ఈ వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడుతూ, లంచం ఇవ్వడం, తీసుకోవటం నేరం అన్నారు. సరుకులు నాణ్యత లోపం ఉన్నా, తూనికలు కొలతలలో తేడాలు, రేషన్ సరుకుల జాప్యం, ప్రభుత్వం నుండి ప్రజలకు అందవలసిన పథకాలు తదితర వాటిపై పిర్యాదులు విజిలెన్స్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్లు కోటేశ్వరరావు, లక్ష్మోజి, సబ్ ఇన్స్పెక్టర్ రవికుమార్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమకు ఆర్టీసి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరిం చాలని మనవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళ విభాగ అధ్యక్షురాలు కె కృష్ణకుమారి కోరారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, బస్సు సౌకర్యం లేక కళాశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రైవేట్ వాహనదారులు కూడా అధిక చార్జీలు వసూలు చేసుకుంటున్నారని చెప్పారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ఆమె కోరారు.

విద్యార్థులతో పనులు సరికాదు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయతీ అల్లంపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలలో విద్యార్థులతో పనులు చేయించడం సరికాదని బాలల హక్కుల పరిరక్షణ వేదిక, ఎస్ఎఫ్ఐ నేతలు ఖండించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.జీవన్ మాట్లాడుతూ, విద్యార్థులతో పనులు చేయిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు. పాఠశాలల్లో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా విద్యార్థులతో పనులు చేయిస్తున్నారని ఆయన విమర్శించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, లేకుంటే విద్యార్థులు కలిసి భారీ ఎత్తున ఆందోళన చేపడతామన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కుష్విందర్ వోహ్రా

ముగిసిన ఐసిఐడి కాంగ్రెస్ సమావేశాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో జరుగుతున్న 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసిఐడి) కాంగ్రెస్ సమావేశాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భారత నీటి పారుదల జాతీయ కమిటీ ఛైర్మన్ కుష్విందర్ వోహ్రా మాట్లాడుతూ ఈ సమావేశాలు 57 సంవత్సరాల తర్వాత దేశంలో జరిగాయని, 40 దేశాల నుంచి 350 మంది విదేశీ ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. జలవనరుల నిర్వహణ, నీటిపారుదల సవాళ్లను ఎదుర్కొనే అంశాలపై చర్చించినట్టు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ సమావేశాల్లో మొత్తం 18 సెషన్లు, 6 అంతర్జాతీయ వర్క్‌షాప్‌లు, 12 సైడ్ ఈవెంట్లు, 2 అంతర్జాతీయ సింపోజియంలు, 2 ప్లీనరీ సెషన్లు నిర్వహించామన్నారు. వ్యవసాయ రంగంలో నీటి కొరతను పరిష్కరించడానికి, ప్రపంచ ఆహార భద్రతను సాధించడానికి నిపుణుల మధ్య పలు చర్చలు జరిగాయని తెలిపారు. ఇప్పటికే ఉన్న నీటిపారుదల మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా నిర్వహించడం, వాతావరణాన్ని తట్టుకునే నీటిపారుదల మౌలిక సదుపాయాలు, నీటిపారుదల రంగంలో ఉపరితల, భూగర్భ జలవనరుల వినియోగం, మెరుగైన నీటి నిర్వహణ, నీటిపారుదల రంగానికి తగిన నిధులు, అంతర్జాతీయ సహకారం తదితర అంశాలపై చర్చించినట్టు తెలిపారు. సమావేశాల్లో యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎఒ), ఇంటర్నేషనల్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఐడబ్ల్యుఎంఐ), ఇండియా ఇయు వాటర్ పార్టనర్‌షిప్ (ఐఇడబ్ల్యుపి), జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ (జిఐజెడ్), ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్ డ్రై ఏరియా, స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్, చైనీస్ నేషనల్ కమిటీ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ, నీటిపారుదల జాతీయ కమిటీలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశాయన్నారు. మీడియా సమావేశంలో సిడబ్ల్యుసి డైరెక్టర్ సునీల్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రాస్ బౌ షూటింగ్‌లో 18 పతకాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆగ్రాలో అక్టోబర్ 26 నుంచి 31వ తేదీ వరకు జరిగిన 10వ అంతర్జాతీయ క్రాస్ బౌ ఛాంపియన్ షిప్ పోటీల్లో తమ విద్యార్థులు 18 పతకాలు సాధించారని భారత్ షూటింగ్ అకాడమీ డైరెక్టర్, కోచ్ గణేష్ తెలిపారు. ఎంవిపి.కాలనీలోని అకాడమీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పోటీల్లో తమ సంస్థ నుంచి 12 మంది సభ్యులు పాల్గొనగా 11 మంది 18 పతకాలు సాధించారని తెలిపారు. 9 బంగారు, 5 వెండి, 4 రజత పతకాలు సాధించారని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా 8 దేశాల నుంచి సుమారు 100 మంది షూటర్స్ పాల్గొన్నారని, భారతదేశం నుంచి 30 మంది షూటర్స్ పాల్గొనగా అందులో 12 మంది తమ అకాడమీలో శిక్షణ పొందినవారు ఉండటం సంతోషకరంగా ఉందన్నారు. తమ సంస్థ నుంచి నసీర్ అలి, లోహిత్, నేహాపట్నాయక్, లోహిత్ పట్నాయక్, నాసర్ అలి, లోక్ జిత్, రవికిరణ్, సాయి కౌశిక్, ప్రణతి కృష్ణ, అంబిక, అనిల్ వర్మ, త్రిలోక్‌నాథ్ పతకాలు సాధించారని చెప్పారు.

వచ్చేనెల 9న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి-గాజువాక: వచ్చేనెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసే చర్యలు తీసుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి షణ్ముఖరావు కోరారు. శనివారం గాజువాక కోర్టు సముదాయంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో అన్ని రకాల సివిల్, క్రిమినల్ వివాదాలను, ఇన్సూరెన్స్, రెవెన్యూ కేసులను పరిష్కరించకోవచ్చునని, కక్షిదారులు వినియోగించుకొని సంబంధిత కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కెవి స్వామి, కోశాధికారి పల్లా శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఇ.గిల్బర్ట్, ఎం పార్వతీశం, ఆర్ సూర్యనారాయణ, సీనియర్ జూనియర్ న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు

చట్టాలపై న్యాయ అవగాహన

న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బివికె..కళాశాల విద్యార్థులకు శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవి.శేషమ్మ ఆధ్వర్యంలో పలుచట్టాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.కారక్రమంలో పోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి జి. ఆనంది, జువెనైల్ జస్టిస్ యాక్ట్, పోక్సో యాక్ట్, రూల్స్ గురించి వివరించారు. రెండవ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ క.వి.యల్. హిమబిందు, పిల్లల నేరాల నివారణ, నిర్బంధానికి ప్రత్యామ్నాయాలు, కస్టడీయేతర ప్రత్యామ్నాయాలు, పునరావాసం, పునరుద్ధరణ పద్ధతులు, న్యాయపరమైన విచారణ, పిల్లల స్నేహపూర్వక విధానాలకు హక్కు, నేర బాధ్యతకు కనీస వయస్సు తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవి.శేషమ్మ, ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ 1997 చట్టంలో వివిధ అంశాలను వివరించారు. విద్యార్థులు. ర్యాగింగ్ పాల్పడితే విధించే శిక్షలు, జరిమానాలు గురించి వివరించారు. కార్యక్రమంలోబివికె. కాలేజీ కరెస్పాండెంట్ వై. శ్రీధర్,, ప్రిన్సిపల్ డివిఎల్ఎన్, జోగిరాజు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూపార్కు సందర్శన

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలను డెహ్రాడూన్ ఫారెస్ట్ అకాడమీ ప్రొబెషనర్లు శనివారం సందర్శించారు. శిక్షణలో భాగంగా జూపార్కు నిర్వహణ, జూలో కన్జర్వేషన్ బ్రీడింగ్, వివిధ జంతు పరిరక్షణ కార్యక్రమాలపై జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియాను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంతరించిపోతున్న, అరుదైన జాతుల వివిధ జంతువులకు ప్రసిద్ధి చెందిన ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల చరిత్ర, ప్రాముఖ్యతను డాక్టర్ నందనీ సలారియా వివరించారు. వన్యప్రాణుల సంరక్షణలో జూల పాత్ర, బాధ్యతలపై తమకు అవగాహన, అమూల్యమైన అనుభూతి కలిగిందని ప్రొబెషనర్లు వెల్లడించారు. కార్యక్రమంలో జూ అధికారులు మంగమ్మ, గోపి, గోపాల నాయుడు, భారతి, రాజేష్, జూ ఎడ్యుకేషన్ బృందం పాల్గొంది.

జూ పార్కు సందర్శనలో ప్రొబెషనర్లు

నేటి ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- విఆర్.పురం :అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజారక్షణ భేరి పేరుతో సిపిఎం చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం మండలానికి వస్తుందని, ఇందులో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని కొట్టూరుగొమ్ము గ్రామంలో జీడిగొప్పు జోన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు రేఖపల్లిలో బహిరంగ సభ జరుగుతుందని, ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రసంగిస్తారని, ఈ సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్.సుబ్బారావు, కదల కొండయ్యరెడ్డి, వాళ్ల కృష్ణారెడ్డి, ఖధర్, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎటపాక : ప్రజారక్షణభేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఐవి పిలుపునిచ్చారు. అక్టోబర్ 30న ప్రారంభమైన బస్సు యాత్ర నవంబర్ 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందని, ఏజెన్సీ ప్రాంత యాత్రకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సారథ్యం వహిస్తున్నారని తెలిపారు. 5వ తేదీన సాయంత్రం 5 గంటలకు ఎటపాక మండలం తోటపల్లి గ్రామంలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. వ్యవసాయ కార్మికులు, రైతులు, ఉద్యోగస్తులు, నిరుద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, జర్నలిస్టులు, మేధావులు, అభ్యుదయ వాదులు, ప్రజలందరూ ఈ సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో సిపిఎం నేతలు

దేశ ప్రగతికి నూతన ఆవిష్కరణలు కీలకం

గీతం యూత్ కాన్‌క్లేవ్‌లో ఎన్‌ఎస్‌టిఎల్ డైరక్టర్ జనరల్ డాక్టర్ శ్రీనివాసరావు

ప్రశంసాపత్రాలు ఇస్తున్న ఎన్‌ఎస్‌టిఎల్ డైరక్టర్ జనరల్ డాక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- మధురవాడ : దేశ ప్రగతికి నూతన సాంకేతిక పరిజ్ఞానం కీలకమని,: పారిశ్రామిక రంగం నుంచి అంతరిక్షరంగం వరకు నూతన ఆవిష్కరణల ఆవశ్యకత ఎంతో ఉందనిఎన్‌ఎస్‌టిఎల్ డైరక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. శనివారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చి బోర్డు (సెర్బ్), ఇండియన్ నేషనల్ అకాడమి ఆఫ్ ఇంజనీరింగ్ (ఐఎన్ఎఇ) సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి యువ సమ్మేళనం 'యూత్ కాన్‌క్లేవ్ -2023' ముగింపు సభలో మాట్లాడుతూ సమాచార సాంకేతిక రంగం, కమ్యూనికేషన్ వ్యవస్థలు, శక్తి వనరుల రంగంలో వస్తున్న మార్పులను యువత అర్థం చేసుకోవాలన్నారు. హరిత సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే సరికొత్త ఆవిష్కరణలకు ప్రపంచ వ్యాప్తింగా డిమాండ్ ఉందన్నారు. రక్షణ, అంతరిక్ష రంగంలో ఇతర దేశాలతో భారత్ పోటీ పడుతోందన్నారు.

ఐఎన్ఎఇ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ శివాజి చక్రవర్తి మాట్లాడుతూ నూతన ఆవిష్కరణల ద్వారా యువత స్టార్టప్‌లతో ఏవిధంగా ఎదగవచ్చో వివరించారు. బజాజ్ ఆటో సంస్థ నైపుణ్యాభివృద్ధి విభాగాధిపతి రమేష్ వేణుగోపాలస్వామి మాట్లాడుతూ దేశంలోని ఐటిల సహ వివిధ విద్యాలయాల నుంచి వస్తున్న యువతలో నైపుణ్యాల లోపం గుర్తించి తమ సంస్థ బజాజ్ ఇంజనీరింగ్ స్కిల్స్ ట్రైనింగ్ (బెస్ట్) పేరిటి ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పిందన్నారు. 70 శాతం ప్రాక్టకల్ శిక్షణతో ప్రత్యేక కోర్సులను రూపొందించి వివిధ విద్యాలయాల ద్వారా యువతకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రరిశ్రమలు ఎదుర్కొంటున్న 200 పైగా సమస్యలను తాము గుర్తించామని వాటి పరిష్కారాన్ని కనుగొనే వారికి సహకరిస్తామన్నారు.

గీతం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, ఐఎన్ఎఇ కోర్డినేటర్ ప్రొఫెసర్ డిఆర్.ప్రసాద్‌రాజు, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్, యువతలో నైపుణ్యాలను వెలికితీయడానికి ఈ తరహా యువ సమ్మేళనాలు మరిన్ని జరగాలన్నారు. గీతం రీసెర్చి డవలప్‌మెంట్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ రాజాపప్పు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు పైర్లను ఐడబ్ల్యుఎంఐ బృందం సందర్శన

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని తర్లువాడలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న పంటపొలాలను ఇంటర్నేషనల్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇనిషియేటివ్ ఐడబ్ల్యుఎంఐ బృందం శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఐడబ్ల్యుఎంఐ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మార్క్ స్మిత్, భారత ప్రతినిధి డాక్టర్ అలోక్ సిక్కా పాల్గొని, తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న రైతులతో సమావేశమై సాగు పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహనరావు, రీజనల్ అధికారులు ప్రకాశరావు, కృష్ణారావు, హేమసుందర్, వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, నేచురల్ ఫార్మింగ్ జిల్లా అసోసియట్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఎన్‌ఎస్‌టిఎల్‌లో ముగిసిన టెన్నిస్ టోర్నీ

ప్రజాశక్తి -కరాస : ఎన్‌ఎస్‌టిఎల్ ప్రాంగణంలో నిర్వహించిన డిఆర్‌డిఒ సెంట్రల్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో ఎన్‌ఎస్‌టిఎల్‌తో సహా తొమ్మిది జట్లుకు చెందిన 102 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన హైదరాబాద్ నుండి అడ్వాన్సడ్ సిస్టం లేబరేటరీ (ఎఎస్ఎల్) టీం ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోగా, హైదరాబాద్‌కే చెందిన మరో ప్రయోగశాల రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సిఐ) రన్నరప్‌గా నిలిచింది. టోర్నీలో సెంటర్ ఫర్ హైఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్ (సిహెచ్ఇఎస్ఎస్), డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ లేబరేటరీ (డిఎల్ఆర్ఎల్) , డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ లేబరేటరీ (డిఆర్‌డిఎల్) , డిఫెన్స్ మెటాలర్జికల్ రీసెర్చ్ లేబరేటరీ (డిఎంఆర్ఎల్), బాలాసోర్ నుండి ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటిఆర్), ప్రూఫ్ అండ్ ఎక్స్పెరిమెంటల్ ఎస్టాబ్లిష్మెంట్ (పిఎక్స్ సి) జట్లు పాల్గొన్నాయి. ఎపి టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్, విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్‌కు అనుబంధంగా ఉల్లాసభరితమైన వాతావరణంలో టోర్నీని ముగించారు.

అండర్ -15 ఎసిఎ రాష్ట్ర మహిళా జట్టుకు

ఇద్దరు ఎయు పాఠశాల విద్యార్థినులు

ప్రజాశక్తి- విశాఖపట్నం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) అండర్-15 రాష్ట్ర మహిళా జట్టుకు 2023-24 సీజన్‌కు ఎయు ఇంగ్లీష్ మీడియం స్కూల్ 9వ తరగతి విద్యార్థినులు పివిఎల్ఎన్. పరిమళ, పిజె.గాయత్రి ఎంపికయ్యారు. రాష్ట్ర మహిళా జట్టుకు ఎంపికైన విద్యార్థినులను స్కూల్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ కె.సమత, ప్రిన్సిపల్ సుధారాణి, ఇతర ఉపాధ్యాయులు, సహాయక సిబ్బంది అభినందించారు.

ఎంపికైన విద్యార్థులు పరిమళ, గాయత్రి

నర్సీపట్నం వైసిపి ఎన్నికల పరిశీలకునిగా బొడ్డేటి

ప్రజాశక్తి -సీతమ్మధార : అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గ వైసిపి ఎన్నికల పరిశీలకుడిగా సీనియర్ నేత బొడ్డేటి విశ్వనాథను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు . ఈ సందర్భంగా బొడ్డేటి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నర్సీపట్నంలో అందరి సమిష్టి కృషితో వైసిపి విజయానికి పాటుపడతానన్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని స్పష్టం చేశారు.

న్యాయ కళాశాలకు ఎసి వితరణ

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాలకు ఎల్ఎల్‌బి చివరి సంవత్సరం విద్యార్థి దాసరి పృథ్వీరెడ్డి నూతన ఎసిని బహూక రించారు. శనివారం ఎయు న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మిని కార్యాలయంలో కలసి ఎసిని అందజేశారు. భవిష్యత్తులో తనకు చేతనైన సాయాన్ని ఇలాగే అందిస్తానన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఎయు న్యాయ కళాశల ఎందరో న్యాయ కోవిదులను, రాజకీయ నాయకులను దేశానికి అందించిందన్నారు. ఇక్కడ ఉన్నత విద్యను అభ్యసించిన విద్యార్థులు ఉన్నతంగా రాణించడం వర్సిటీకి గర్వకారణమన్నారు. విద్యార్థులు, పూర్వవిద్యార్థులు కళాశాల అభివృద్ధిని కాంక్షిస్తూ పనిచేయడం సంతోషదాయకమన్నారు.

ఎసి అందజేస్తున్న ఎయు విద్యార్థి పృథ్వీరెడ్డి